కథ

# ఒకరికొకరు

మధ్యాహ్నం ఒంటిగంట. ప్రమీల ఇల్లంతా కలియ తిరుగుతున్నది. తన ఆత్రుత.. ఆమె చూపులను పదేపదే గుమ్మంవైపు చేర్చు తున్నది. క్షణాలు గడిచేకొద్దీ ఆ చూపులు ఎదురు చూపులవుతున్నాయి..! తల్లి కంగారుపడటం చూస్తూ నవ్వింది కూతురు వాసంతి.

''ఏంటే.. ఆ నవ్వు? నా కంగారు నీకు నవ్వులాటగా ఉందా?'' అంది తల్లి!

''అదేం లేదమ్మా.. ప్రశాంతంగా ఉండు!'' అంటూ తల్లి చేయి పట్టుకుని తన ఎదురుగా కూర్చోబెట్టుకుంది.

''అమ్మా! సంబంధం చూస్తున్న రోజుల్లోనే మనీ ఆశించని మనిషి ఉంటే చూడు.. కళ్లు మూసుకుని తాళి కట్టించుకుంటానని చెప్పాను. వింటేగా? 'అబ్బాయి బాగున్నాడు! బాగా ఉన్నోడు! వాళ్లడిగినవి ఇస్తాం.. ఏం భయం లేదు!' అని ముడేశారు. ఇప్పుడేమైంది? ఆడపిల్లని పెంచి, పెద్దచేసి, ఆ ఫ్యామిలీ ఇరవై ఏళ్ల కష్టం పోగేసి కట్నకానుకలుగా ఇస్తారని తెలిసి కూడా కట్నమడిగే ప్రతి మగాడిదీ తప్పు. అది తప్పని తెలిసి తాహతుకి మించి కట్నమిస్తామని ఒప్పుకొంటున్న తల్లిదండ్రులది ఇంకా పెద్ద తప్పమ్మా!'' అంటూ చెప్పుకొచ్చింది కూతురు.

''నువ్వు చెప్పింది నిజమేనే! కానీ, ఏ ఆడపిల్లకైనా పెళ్లి వరమవ్వాలి. శాపంలా మారకూడదు. అత్తారింటిలో కూతురు బాగుండాలనే ఆశే కదా ప్రతి తల్లిదండ్రులది. అందుకే తల తాకట్టు పెట్టయినా తాహతుకి మించి కానుకలు ఇస్తారు. అయినా, కట్నకానుకల్లో మీ ఆయనకు లక్షలేమన్నా ఎగ్గొట్టామా? పెళ్లయిన ఆడపిల్ల అత్తింట్లో కన్నా పుట్టింట్లో ఎక్కువగా కనిపిస్తే చూసేవాళ్లు ఏమనుకుంటారు? అయినా, ఈరోజు గడిస్తే చాలమ్మా! మీ ఇంటికి నువ్వు వెళ్లిపోతావు'' అంది తల్లి.

ఆ మాటకు ఒక్క ఉదుటున వచ్చి తల్లిని కౌగిలించుకుంది. ఆమె కళ్ల నుండి జారిన బాధల చినుకులు ప్రమీల భుజాన్ని తడిపాయి.

''పిచ్చితల్లి! ఎక్కడికి పోతావే! ఫోన్‌కాల్ దూరంలోనే ఉంటావు కదా!'' అంటూ.. చెమర్చిన తన కళ్లను చీర కొంగుతో తుడుచుకుని, కూతురిని ఓదార్చింది ప్రమీల.

''చెల్లికి ఫోన్‌చేయి! వెళ్లి చాలా సేపయ్యింది. లగేజీ మొత్తం సర్దేసుకో.. మళ్లీ అక్కడికెళ్లి 'అది లేదు! ఇది లేదు!' అని నా ప్రాణాలు తీయొద్దు.. చెల్లి రాగానే అల్లుడుగారికి ఫోన్‌చేసి రమ్మని చెప్పు'' అంది.

అప్పుడే కాలింగ్ బెల్ మోగింది. వాసంతి వెళ్లి డోర్ ఓపెన్ చేసింది. ఎదురుగా చెల్లి మహతి.

''ఎందుకే.. ఇంత లేట్!?'' అంటూ ఆమె భుజానికున్న హ్యాండ్‌బ్యాగ్ లాక్కొని..

''అమ్మా!'' అంటూ ఇంట్లోకి పరుగెత్తింది వాసంతి.

బ్యాగ్ లాక్కెళ్తుందని ఊహించని మహతి..

''అక్కా! అక్కా! ఆగు..'' అంటూ వెనకాలే వెళ్లింది.

మహతిని చూసిన తల్లి..

''ఇంత లేట్ అయ్యిందేంటమ్మా! బ్యాంకులో డబ్బుల్లేవా?''.. డబ్బులు వచ్చాయన్న సంతోషంలో నవ్వుతూ అన్నది.

ఇంతలో బ్యాగ్ ఓపెన్ చేసిన వాసంతి..

''బ్యాంకులో కాదమ్మా.. బ్యాగులోనే డబ్బులు లేవు!'' అని చెప్పింది.

ఆ మాటలకు ప్రమీల అవాక్కయి..

''అదేంటే.. డబ్బుల్లేవంటావ్? మతి పోయిందా! సరిగ్గా చూడు!'' అంది.

''చూసే చెప్తున్న.. బ్యాగు ఖాళీగా ఉందమ్మా''

''ఏమైందే? వట్టి చేతుల్తో వచ్చావ్? బ్యాంకుకు వెళ్లలేదా?'' చిన్న కూతురి భుజం తట్టి అడిగింది తల్లి.

''వెళ్లానమ్మా''..

''వెళ్తే డబ్బులు ఎక్కడే?''.. బ్యాగ్ పక్కన పడేస్తూ కోపంగా అడిగింది వాసంతి.

''అక్క అడుగుతుందిగా!? చెప్పవే!''

''అంత కోపం దేనికే? ముందు ఏం జరిగిందో చెప్పు'' మళ్లీ అడిగింది వాసంతి.

''డబ్బులు డ్రా చేసి రోడ్డు దాటి వస్తుంటే.. ఒక పెద్దయానకు స్ట్రోక్ వచ్చి పడిపోయాడు. అక్కడున్న ఒక్కరూ హెల్ప్ చేయకపోగా.. ఫోన్లో వీడియోలు తీస్తూ నిలబడి చూస్తూ ఉన్నారంతా! నేను మాత్రం అలా ఉండలేక పోయా! అంబులెన్స్‌కు ఫోన్ చేసి, హాస్పిటల్‌కు తీసుకువెళ్లాను. కండిషన్ సీరియస్‌గా ఉన్నదనీ, వెంటనే ఆపరేషన్ చేయాలని అక్కడి డాక్టర్లు చెప్పారమ్మా! అమౌంట్ కడితే ఏర్పాట్లు చేస్తామన్నారు. దాంతో.. వేరే ఆలోచించకుండా.. అమౌంట్ కట్టేశా!''.. అని చెప్పీ చెప్పగానే మహతి చెంప చెళ్లుమంది. ఆ దెబ్బకు కిందపడిపోయింది.

''కొంప ముంచావు కదే! మీ అక్క కాపురం కూల్చేశావు. నువ్వసలు మనిషివేనా? ఎవరో పడిపోతే నీకేంటే? ఆడపిల్లవై ఉండి.. అణిగిమణిగి ఉండకుండా.. మగరాయుడిలా ఇవేం పనులే!? సొంతవాళ్లనే పట్టించుకోకుండా హాయిగా బతుకుతున్న రోజులివి.. ఆయన గద్దించింది తల్లి.

''అమ్మా!!'' అని నసుగుతున్న మహతిని చూసి..

''ఏంటే.. నీళ్లు నములుతున్నావ్? నాకేదో అనుమానంగానే ఉందే!'' అంటూ ప్రమీల కంగారు పడిపోయింది.

''అమ్మా! ఏదేదో ఊహించుకుంటూ టెన్షన్ పడకు. ముందు దాన్ని చెప్పనివ్వు''.. అంటూ తల్లిని నిదానపరిచింది వాసంతి.

''దాని వాలకం చూస్తుంటే తెలియడం లేదా? డబ్బులుంటే బ్యాగులో ఉండాలిగా? మేం అంతలా అరుస్తుంటే మాట్లాడవేంటే??'' కాస్త కోపాన్ని పెంచింది తల్లి.

అక్కా, అమ్మ కలిసి ప్రశ్నలమీద ప్రశ్నలు వేస్తుంటే.. మహతికి కోపం వచ్చి..

''నన్ను మాట్లాడనిస్తేగా మీరు'' అంది.





పట్ల యాదగిరి,
99859 26292